క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



అంబాపురం (విజయవాడ రూరల్): అంబాపురంలో వరద ముంపునకు గురైన సుమారు 300 బాధిత కుటుంబాలకు శనివారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వరదల కారణంగా ఎన్నో కుటుంబాలు నిరాశ్రయులయ్యాయని వారిని ఆదుకోవడంలో ఇన్నర్ వీల్‌క్లబ్ సాయం అందిస్తుందని క్లబ్ ప్రెసిడెంట్ సంధ్య చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి తోడేటి విజయ్‌కుమార్, సీఎస్‌ఐ డీనరీ చైర్మన్ రెవరెండ్ చిలువూరి జయరాజు, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఏ ఒక్కరికి మేలు చేయని ప్రభుత్వం

జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి

గన్నవరం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం విస్మరించి ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. అధికారంలోకి రాగానే సంపద సృష్టిస్తామని చెప్పిన పాలకులు అప్పులు చేసి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. సూపర్‌సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. వంద రోజుల పాలనలో ఏ ఒక్కరికి మేలు చేయని పాలకులు 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ గ్రామాలకు వెళ్లడం సిగ్గుచేటని తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు: కానూరులో విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌కు చెందిన ఎం.వెంకటనాగేంద్రప్రసాద్ భవననిర్మాణ పనులు చేస్తాడు. అతను కానూరు మురళీనగర్‌లో భార్య, ఇద్దరు కుమార్తెలతో ఉంటాడు. పెద్ద కుమార్తె (19) విజయవాడలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. ఈ నెల 20న చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెదికినా ఆచూకీ తెలియలేదు. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడటంతో పెనమలూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి రామాపురం కాలనీకి చెందిన తుపాకుల నాగపద్మావతి కుటుంబ సభ్యులతో నివసిస్తోంది. ఆమె కానూరులో తల్లి వద్దకు వెళ్లడానికి స్కూటర్‌పై బయలుదేరింది. ఆమె కానూరు ఇంజినీరింగ్ కాలేజీ వద్దకు రాగా వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన ఆటో ఆమె వాహనాన్ని ఢీ కొట్టింది. ఘటనలో నాగపద్మావతి రోడ్డుపై పడి గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

విద్యార్థుల్లో మానసిక వికాసం పెంచడానికే..

నున్న(విజయవాడరూరల్): విద్యార్థుల మానసిక వికాసాన్ని పెంపొందించడానికి 'స్పేస్ ఆన్ వీల్స్' దోహదపడుతుందని అతిథులు చెప్పారు. నున్న వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో వారి స్పేస్ ఆన్ వీల్స్ ద్వారా ఇస్రో తయారు చేసిన వివిధ రకాల రాకెట్లు, శాటిలైట్ల మోడల్స్‌ను విద్యార్థుల అవగాహనకు శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయశాస్త్రి మాట్లాడుతూ స్వదేశీ శాస్త్ర పరిజ్ఞానంలో దేశం ప్రపంచంలోనే మొదటి మూడు స్థానాలను పొందిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాసు, కరస్పాండెంట్ ఎస్. సత్యనారాయణరెడ్డి, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి కిషోర్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏలూరు కాలువకు నీరు వదలండి



ఆర్‌బీకేలో వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, రైతులు

ఉంగుటూరు: ఏలూరు కాలువకు నీరు వదిలి వరి సాగు రైతులను ఆదుకోవాలని తేలప్రోలు వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ఆర్‌బీకేలో వ్యవసాయ సహాయకులు రాంప్రసాద్, రమకు వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ గ్రామ కన్వీనర్ వింత శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏలూరు కాలువ నుంచి నీరు వదలక పోవడంతో గ్రామంలో సుమారు ఏడు వేల ఎకరాల పంటకు నష్టం వటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ తియ్యగూర రామిరెడ్డి, సుబ్బారెడ్డి, సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వేతనం పెంచక.. వెతలు తీరక..

- జీతాలు పెంచుతామని రెండు నెలల క్రితం మాయ హామీలు
- ఈ నెలా పాత వేతనమే..
- రామవరప్పాడు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల్లో ఆందోళన



రామవరప్పాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

రామవరప్పాడు: జీతాలు పెంచుతామని మాయ హామీలు ఇచ్చారు... ఆనక ఇచ్చిన మాట మరిచి ఈ నెల పాత జీతమే ఇచ్చారు రామవరప్పాడు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు. రెండు నెలల క్రితం జీతాల పెంపు చేస్తామన్న పంచాయతీ పాలకులు ఇప్పుడు మాట తప్పారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర గ్రామాల్లో ఇచ్చినట్లు కనీస వేతనాలు ఇవ్వకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ పాలకుల మధ్య మూడు నెలలుగా వివాదం జరుగుతోంది. మేజర్ పంచాయతీ రామవరప్పాడులో సుమారు 100 మందికి పైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. నగరానికి అతి సమీపంలో ఉన్న పంచాయతీ ఇది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామం కావడంతో కార్మికులపై పనిభారం కూడా ఎక్కువే. ఈ నేపథ్యంలో వారికి నెలకు రూ. 10,500 జీతం ఇస్తున్నారు. దీంతో నెలవారీ జీవనం కూడా వారికి భారమవుతోంది. వేతనాల కమిటీ ప్రకారం జీతాలు చెల్లించాలని కార్మికులు మూడు నెలలుగా డిమాండ్ చేస్తున్నారు. ఇవి పట్టని పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహన్‌రావు, సర్పంచ్ వరి శ్రీదేవి ఇష్టారాజ్యంగా వ్యవహరించడం కార్మికులను ఆగ్రహానికి గురి చేస్తోంది.

గుట్టుచప్పుడు కాకుండా టెండర్లు!

ఈ వివాదం జరుగుతుండగానే గత పారిశుద్ధ్య టెండర్ల పదవీ కాలం పూర్తవడంతో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు గుట్టుచప్పుడు కాకుండా 2024-25కు పారిశుద్ధ్య పనులకు జూలై మొదటి వారంలో టెండర్లు ఆహ్వానించారు. మరొకరు టెండర్ వేయకుండా సర్పంచ్. అనుయాయులతో టెండర్లు వేయించి ఆమోదింపజేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే పాలకవర్గ సభ్యులు అదే నెల 22వ తేదీ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో.. అక్రమంగా వేసిన టెండర్లను వ్యతిరేకించి మళ్లీ ఆహ్వానించాలని మెజార్టీ వార్డు సభ్యులు ఓటింగ్ పద్ధతిలో ఓటు వేశారు. దీంతో తప్పని పరిస్థితిలో మళ్లీ టెండర్లు ఆహ్వానించారు. జూలై చివరి వారంలో టెండర్లు ఆహ్వానించారు. అందరితో కుమ్మక్కై కావాలనే తక్కువ ధరకు కోట్ చేయించి టీడీపీకు చెందిన ఓ వ్యక్తికి టెండర్ కట్టబెట్టారు. ఈ విషయం బయటకు పొక్కడంతో తక్కువ ధరకు టెండర్ వేసి మా పొట్ట కొడతారా అంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేసి రామవరప్పాడు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆగస్టు మొదటి వారంలో విధులు బహిష్కరించి పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

తప్పనిసరి పరిస్థితుల్లో..

పారిశుద్ధ్య కార్మికులతో ఆటలాడుకుంటున్న రామవరప్పాడు పంచాయతీ పరువు బజారున పడటంతో సర్పంచ్, కార్యదర్శి కార్మికుల వద్దకు సర్ది చెప్పారు. విధులు బహిష్కరించి నిరసన చేస్తే గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతాయని టెండర్‌తో సంబంధం లేకుండా వేతనాలు పెంచుతామని వారు గత నెల హామీ ఇవ్వడంతో నిరసనను విరమింపజేశారు.

కార్మికుల డిమాండ్ ప్రకారం ఒక్కొక్కరికి రూ. 13,500 వేతనాలు చెల్లించాల్సి ఉన్నా గత నెల కూడా పాత జీతమే ఇచ్చారు. ఈ నెల కూడా పాత వేతనమే వీరికి అందింది. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన వేతనాలు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మళ్లీ విధులు బహిష్కరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

తాడిగడప కమిషనర్ బదిలీ

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటేశ్వరరావు స్థానంలో మున్సిపల్ కమిషనర్ స్పెషల్ గ్రేడ్‌గా ఉండి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న పి.భవానీప్రసాద్‌ను నియమించారు. ఇంతకాలం కమిషనర్‌గా డిప్యుటేషన్ మీద ఉన్న వెంకటేశ్వరరావును సొంత శాఖ పీఆర్ అండ్ ఆర్ డీ లో డీఎల్‌డీవోగా వెళ్లారు. అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న జి.మల్లికార్జునరావును కూడా బదిలీ చేశారు.

ఆయన కూడా డిప్యుటేషన్‌పై అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్నారు. ఆయన్ను తన సొంత శాఖ అడల్ట్ ఎడ్యుకేషన్‌కు పంపారు. జ.మల్లికార్జునరావు స్థానంలో అసిస్టెంట్ కమిషనర్‌గా వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న డి.కిరణ్‌కుమార్‌ను పదోన్నతి ఇచ్చి నియమించారు. తాడిగడప మున్సిపల్ కమిషనర్ పదవికి కొద్ది కాలంగా తీవ్ర పోటీ ఏర్పడింది. ఈ పోస్టుకు పెద్ద ఎత్తున పైరవీలు జరిగాయి. చివరకు భవానీప్రసాద్‌కు తాడిగడప మున్సిపల్ కమిషనర్ హాట్‌సీట్ పదవి వరించింది.

దురాచారాలు రూపుమాపిన గురజాడ



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమాజంలోని సాంఘిక దురాచారాలను అభ్యుదయ రచనలు, నాటికల ద్వారా అరికట్టేందుకు గురజాడ అప్పారావు చేసిన కృషి చిరస్మరణీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన రచించిన దేశమంటే మట్టి కాదోయ్ మనుషులోయ్ గేయం, కన్యాశుల్కం నాటికకు తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ ప్రత్యేకత ఉందని కొనియాడారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గూడపాటి జయరామచంద్రరావు, పాబోలు గణేష్, సభ్యులు దయాల ప్రభాకరరావు, సుబ్బారావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు, జన్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు. బాపులపాడు మండలం రేమల్లేలోని జెడ్పీ హైస్కూల్లోగురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. విద్యార్థులకు గురజాడ చేసిన సాహిత్య, సామాజిక, సాంఘిక సేవలను ప్రధానోపాధ్యాయుడు లూథర్ పాల్, ఉపాధ్యాయుడు భాస్కరరావు వివరించారు.

నిబంధనలకు విరుద్ధంగా విగ్రహ ఏర్పాటు!



ప్రసాదంపాడులో డ్రెయిన్‌ను ఆక్రమిస్తూ ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహం

రామవరప్పాడు: నిబంధనలకు విరుద్ధంగా, కనీస అనుమతులు పొందకుండా రూరల్ మండలం ప్రసాదంపాడు సాయిబాబా ఆలయం సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడం వివాదస్పదంగా మారింది. గ్రామంలోని పాత ఎలిమెంటరీ స్కూల్ వద్ద డ్రెయిన్ ఆక్రమిస్తూ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో గతంలో ఎలిమెంటరీ పాఠశాల ఉండేది. శిథిలావస్థకు చేరడంతో స్కూల్‌ను తొలగించి ఈ ప్రభుత్వ స్థలంలో సచివాలయం నిర్మాణం చేస్తున్నారు. దీన్ని ముందు ఉన్న డ్రెయిన్‌ను ఆక్రమిస్తూ టీడీపీ నాయకులు ప్లాట్‌ఫామ్ నిర్మాణం చేశారు. దీనిపై మెట్లు, దిమ్మె నిర్మించి ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు పూర్తి చేశారు. ప్రభుత్వ స్థలంలో విగ్రహం ఏర్పాటు చేయాలంటే ముందుగా కలెక్టర్ అనుమతులు పొందాలి. అనంతరం పంచాయతీ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాల్సి ఉంది. ఇవేవీ పట్టని టీడీపీలోని ఓ వర్గం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. ఆదివారం విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. గ్రామంలోని ప్రతి వీధిలో పసుపు బ్యానర్లు కట్టి హడావుడి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన విగ్రహంపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు అందినా పట్టనట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

పౌర స్వేచ్ఛకు విఘాతం కలిగించే కొత్త చట్టాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

గన్నవరం: పౌర స్వేచ్ఛకు, హక్కులకు విఘాతం కలిగించే కొత్త క్రిమినల్ చట్టాలను ప్రజలందరూ తిప్పి కొట్టాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్‌లో శనివారం ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలు-ప్రజల హక్కుల'పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకర మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలు భారత రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన హక్కులను భంగం కలిగించే విధంగా ఉన్నాయని చెప్పారు. ఈ చట్టాలు న్యాయ వ్యవస్థ అధికారాలను తగ్గించి, పోలీసు వ్యవస్థకు న్యాయాధికారాలను కట్టబెట్టుతున్నాయన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి కొత్త చట్టాలు విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాల్లో సవరణలు చేయాలని దేశవ్యాప్తంగా న్యాయవాదులు ఉద్యమిస్తున్నారని తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రజాతంత్ర వాదులు, ప్రజలు పాల్గొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. యూనియన్ నేతలు సంపర శ్రీనివాసరావు, సుధాకర్, రాజరత్నం, సుబ్రహ్మణ్యం, అనుమోలు వెంకటేశ్వరరావు, వేము కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల స్థాయి జట్లకు ఈ నెల 24, 25 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు బాపులపాడు ఎంఈవో-2 బి.సురేష్‌కుమార్ శనివారం తెలిపారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో 24వ తేదీన బాలురకు, 25న బాలికలకు సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగ, చెస్ క్రీడల్లో ఎంపికలు నిర్వహించనున్నామని, ఆసక్తి గల క్రీడాకారులు తమతమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయులు బీఎస్ రామచంద్రుడు, సుబ్బారావు, లక్ష్మణరావు, రాజేష్, సాయి, బలరామ్ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



పెనమలూరు: పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి తాడిగడపలో పోషకాహారం మాసోత్సవాల సందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోషకాహారంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తక్కువ ఖర్చుతో పోషకాలు ఉన్న మునగాకు, చిరుధాన్యాలు, ఆకుకూరలు తినాలన్నారు. గర్భిణులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత నర్రా చంటి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి



ఉంగుటూరు: ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ జీవీకే ఎస్వీ ప్రసాద్ అన్నారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులు సేకరించడం, స్వచ్ఛక్లాస్ రూమ్‌లు, క్యాంపస్, గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దడం, పబ్లిక్ ప్రాంతాలను శుభ్రపరచడంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని వివరించారు. విద్యార్థులు తేలప్రోలులో ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృపాకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.శ్రీహరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివిధ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

చిలకలపూడి(మచిలీపట్నం): మహిళాభివృద్ధి, శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ వాత్సల్య, మేనేజర్/కో-ఆర్డినేటర్, డాక్టర్, ఆయా, చౌకీదార్, కుక్, హెల్పర్, నైట్ వాచ్‌మెన్, యోగా ఇన్‌స్ట్రక్టర్, పారా మెడికల్ పర్సన్, సెక్యూరిటీ గార్డు, బ్లాక్ కో-ఆర్డినేటర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోగా విజయవాడ కానూరులో ఎస్ఎస్ఆర్ అకాడమీ, ఉమా శంకర్ నగర్‌లో ఉన్న జిల్లా మహిళ సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయానికి పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 89776 75206, 99515 13727 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నూజివీడు రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బాపులపాడు మండలంలో బుడమేరు వరద ముంపునకు గురై నష్టపోయిన 40 బాధిత కుటుంబాలకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు చేతుల మీదగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నీలం ప్రభాకర్, జిల్లా కార్యదర్శి వెలమర్తి రవిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కలపాల తాతబాబు, మండల అధ్యక్షురాలు పి.జగతి, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా చవితి ఉత్సవాలు

పెనమలూరు: అత్యంత ప్రతిష్టాత్మకంగా పెనమలూరు పల్లిపేటలో వినాయకుడి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి ఆదివారంతో వినాయక ఉత్సవాలు ముగుస్తుండటంతో ఆదివారం భారీ ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. పల్లిపేటలో అంగ్రాజు శ్రీనివాసరావు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 34వ వార్షిక వినాయక ఉత్సవాలు కొన్ని రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. వినాయకుడి విగ్రహం మార్గంలో వంతెన వద్ద 101 శివలింగాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఊరేగింపు గ్రామంలో నిర్వహిస్తామని నిర్వాకుడు అంగ్రాజు తెలిపారు.

మల్లవల్లి పారిశ్రామికవాడకు భూహద్దుల గుర్తింపు



భూహద్దులను పరిశీలిస్తున్న జేసీ గీతాంజలిశర్మ, ఆర్డీఓ పద్మావతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూముల హద్దుల నిర్ధారణ ప్రక్రియ భారీ పోలీస్ బందోబస్తు మధ్య శనివారం జరిగింది. కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ మనీషా త్రిపాఠి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారామ్ సమక్షంలో పారిశ్రామికవాడ భూములకు హద్దులు గుర్తించారు. మల్లవల్లి రీ సర్వే నంబర్ 11లోని 1,360 ఎకరాల భూమికి హద్దులు తేల్చేందుకు జిల్లాలోని సర్వేయర్లతో 12 సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. భూ నిర్వాసితుల ప్రతిఘటనను అడ్డుకునేందుకు భారీ పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు మల్లవల్లి పారిశ్రామికవాడకు చేరుకున్నారు. హనుమాన్‌జంక్షన్ సీఐ కె.వి.వి.ఎన్. సత్యనారాయణ నేతృత్వంలో 10 మంది ఎస్ఐలు, 200 మంది కానిస్టేబుళ్లు, 50 మంది మహిళా పోలీసులతో మల్లవల్లి పారిశ్రామికవాడను మోహరించారు. 2017లో అప్పటి టీడీపీ పాలనలో మల్లవల్లిలోని ఆర్ఎస్ నంబర్ 11లో ఉన్న రెవెన్యూ, అటవీభూముల్లో 1,360 ఎకరాలను పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి అప్పగించారు. దశాబ్దాలుగా ఈ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు ఎకరాకు రూ.7.50 లక్షల చొప్పున నాటి ప్రభుత్వం నష్ట పరిహారాన్ని ప్రకటించింది. దాదాపు 200 మంది సాగుదారులకు రాజకీయ పక్షపాత ధోరణితో పరిహారం దక్కకుండా కక్షపూరితంగా వ్యవహరించింది. పరిహారం అందని సాగుదారులు తమ భూములను ఏపీఐఐసీకి అప్పగించకుండా ఏడేళ్లుగా ఆందోళన కొనసాగిస్తున్నారు. భారీ పోలీసు బందోబస్తుతో అధికార యంత్రాంగం ఈ భూములను స్వాధీనం చేసుకుని హద్దులు నిర్ధారించింది. న్యాయస్థానంలో కేసులు నడుస్తున్న భూములు మినహా మిగిలిన భూములకు రెవెన్యూ, సర్వే అధికారులు హద్దులు లెక్క తేల్చి ఏపీఐఐసీకి అప్పగించారు.

అక్రమ కట్టడాలపై చర్యలు ఏవీ..



గోసాల వైకుంఠపురంలో కాలువ కట్ట ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ కట్టడం

పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో అత్యంత విలువైన స్థలం బందరు కాలువ కట్టను ఆక్రమించి కట్టడం నిర్మిస్తున్నా అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. సాక్షిలో 'కాలువ కట్ట.. వేసేయి పాగా' శీర్షికతో శనివారం 'సాక్షి' కథనం ప్రచురించింది. దీంతో రెవెన్యూ అధికారులు ఘటనా స్థలం వద్దకు వెళ్లి హడావుడి చేసి పరిశీలించారు. టీడీపీకి చెందిన ఆక్రమణదారుడు ఇప్పటికే భవన నిర్మాణానికి పిల్లర్లు, ఫౌండేషన్ వేశాడు. అక్రమ కట్టడం చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఆక్రమణదారుడు యథాతథంగా భవనం నిర్మించే పనిలో ఉన్నాడు. చట్ట ప్రకారం అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యల విషయంలో దాగుడుమూతలాడుతున్నారు. మరో పక్క అత్యంత విలువైన ప్రభుత్వం స్థలం కబ్జాదారుల చేతిలోకి వెళ్లింది.

కేసు పెడతాం

ఈ విషయమై ఆర్ఐ భరద్వాజ్ మాట్లాడుతూ తహసీల్దార్ ఆదేశంతో ఆక్రమణలు పరిశీలించి హెచ్చరించామన్నారు. ఇరిగేషన్ ఏఈని ఆక్రమణదారుడిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించామని తెలిపారు. కాలువ కట్టలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉప్పలూరు, ఎనికేపాడులో ఉచిత వైద్య పరీక్షలు

కంకిపాడు: ప్రజారోగ్య పరిరక్షణలో దాతల భాగస్వామ్యం అభినందనీయమని ఎస్ఐ డి.సందీప్ అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన అన్నే అచ్చియ్య, నిర్మలకుమారి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు అన్నే కేశవరావు, అన్నే ధనరామకోటేశ్వరరావు సహకారంతో, పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రి (ఆవుటపల్లి) సహకారంతో ఉప్పలూరులో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎస్ఐ డి.సందీప్ ప్రారంభించారు. 225 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు.

రామవరప్పాడు: రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పలు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 242 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. స్త్రీ సంబంధిత వ్యాధులకు హరిత, హరికలు, ట్రస్ట్ జాయింట్ సెంటర్ ఆధ్వర్యంలో ఎముకల దృఢత్వ పరీక్షలు, సంధ్య కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓ బి.చిన్ని, లైబ్రేరియన్ సత్యకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం



పెనమలూరు: తాడిగడపలో శనివారం టీడీపీ నేతలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి హామీని అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, నర్రా చంటి, పీతా గోపీచంద్, రామ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి

కంకిపాడు: ఉండి ఎమ్మెల్యే రఘురాంకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో ఎమ్మెల్యే రఘురాంకృష్ణంరాజు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని ఉద్దేశపూర్వకంగా చించివేశారన్నారు. బ్యానర్ చించడం సంఘ విద్రోహ చర్యగా భావిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వీధి రౌడీలా వ్యవహరిస్తూ రాజ్యాంగ నిర్మాతపై అవమానకరంగా వ్యవహరించటం సరికాదని హితవు పలికారు. ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని లేనిపక్షంలో దళిత సంఘాలను ఐక్యం చేసుకుని రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని గోగులమూడి రాజు హెచ్చరించారు.